

సాక్షి
బాపట్ల
శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 526.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598, ఎడమకు 6,022 విడుదల చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2953 క్యూసెక్కులు విడుదల చేశారు.



న్యాయమూర్తికి ఆహ్వానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను కలిసి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఈఓ అందజేశారు.

న్యూస్‌రీల్

దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



అమరావతి: పవిత్ర శైవక్షేత్రం అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో ఈనెల 15వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపినాథశర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం దసరా ఉత్సవాలలో తొమ్మిది రోజుల పాటు చండీహోమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 20న మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేసి బాలబాలికలకు ఉచితంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. 22న రాత్రి 7గంటలకు చండీ కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. 23న శమీవృక్షం కింద ప్రత్యేక పీఠంపై పూజ నిర్వహిస్తామన్నారు. ఉదయం, సాయంత్రం భక్తులకు ఉచిత ప్రసాదాలను వినియోగం చేస్తామన్నారు. భక్తులందరూ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

91.88 శాతం ఈ-కేవైసీ పూర్తి



కొరిటిపాడు(గుంటూరు): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పంటలను ధ్రువీకరిస్తూ రైతులతో ఈ-కేవైసీ చేయించే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. శుక్రవారం చివరి రోజు కావడంతో రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జీలు, మండల వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం సాయంత్రానికి ఈ-కేవైసీ 91.88 శాతం పూర్తయింది. 1,00,117 మంది రైతులు 2,15,683.48 ఎకరాల్లో సాగుచేసిన పంటలకు ఈ-కేవైసీ చేశారు. ఈ-క్రాప్‌లో 2,35,710.78 ఎకరాల్లో సాగు చేసిన పంటలను నమోదుచేశారు. ఇంకా 20,027.30 ఎకరాల్లోని పంటలకు ఈ-కేవైసీ చేయించాల్సి ఉంది. సర్వర్ పనిచేస్తున్నంత వరకు రైతులతో ఈ-కేవైసీ చేయించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు 'సాక్షి'కి తెలిపారు. ఈ-కేవైసీ లేకపోతే ఈ-క్రాప్‌కు ప్రామాణికత ఉండదు. రైతులు ఆర్‌బీకేల్లో బయోమెట్రిక్ వేయడం ద్వారా లేదా ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవచ్చని సూచించారు.

ఐటీఐలో విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



తెనాలి: స్థానిక జగ్గడిగుంటపాలెంలోగల ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడ్లలో కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు స్నాతకోత్సవం జరిపి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న 'కౌశల్ దీక్షంత్ సమురః' అనే కార్యక్రమం ద్వారా ఈ సర్టిఫికెట్ల బహూకరణ చేసినట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ రావి చిన్నవెంకటేశ్వర్లు తెలిపారు. జగ్గడిగుంటపాలెం సర్పంచ్ కంభం బాలాజి ముఖ్యఅతిథిగా హాజరైన సభలో ట్రెనింగ్ అధికారులు ఎం.రామారావు, సీహెచ్ లక్ష్మణ్, ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శ్యామ్‌సుందర్, ఆఫీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యార్డులో 27,892 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 25,302 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 27,892 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,280 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం

గృహ ప్రవేశ సంబరం

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా
- బచ్చులవారిపాలెం లే అవుట్ ప్రారంభం
- ఎమ్మెల్యే కరణం, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, సునీత, ఇన్‌చార్జి వెంకటేష్ హాజరు
- పండుగలా సాగిన కార్యక్రమం
- లబ్ధిదారుల్లో సంతోషం





వైఎస్సార్ జగనన్న కాలనీ పైలాన్ ఆవిష్కరించిన కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కరణం, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, సునీత, ఇన్‌చార్జి వెంకటేష్, (ఇన్‌సెట్‌లో) గృహాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

వేటపాలెం: ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చి వారికి సొంత గూడు ఏర్పాటు చేసిందని జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా పేర్కొన్నారు. జిల్లాలోని వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని బచ్చులవారిపాలెం వెళ్లే రోడ్డు దగ్గరలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ జగనన్న కాలనీని కలెక్టర్, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పైలాన్‌ని ఆవిష్కరించి ప్రారంభించారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీలలో నిర్మించిన ఐదు లక్షల ఇళ్లను సామర్లకోటలో ప్రారంభించారని చెప్పారు. మన మండలంలో మోడల్ కాలనీలో పూర్తిచేసుకున్న 283 ఇళ్లను ప్రారంభించారని చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా 31,167 అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. అందులో 11 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తియ్యాయన్నారు. 20 వేల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, కాలనీలో చేరిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ జగనన్న మోడల్ కాలనీగా ఎంపిక చేసి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం నెరవేరిందన్నారు. కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకుని గృహాల్లో చేరిన ప్రతి ఒక్కరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వమిది..

ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజలకిచ్చిన ప్రతి వాగ్దానం నెరవేర్చారని గుర్తుచేశారు. అదే విధంగా ప్రతి కుంటుంబానికి లబ్ధి చేకూర్చే విధంగా పథకాలు అమలు చేశారన్నారు. ఎమ్మెల్సీ సునీత మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్లలో ప్రభుత్వానికి ఎన్ని అవాంతరాలు ఎదురైనా పేదలు సంతోషంగా ఉండాలని.. అక్కచెల్లెమ్మలకు ఆస్తి ఉండాలని రూ.5 లక్షల విలువ గల ఇళ్ల స్థలాలు ఇచ్చి సొంతింటి కల నెరేర్చారని తెలిపారు. రాబోవు ఎన్నిల్లో జగనన్నకు అండగా ఉండాలని కోరారు. అనంతరం జగనన్న కాలనీ నిర్మాణంలో పాలు పంచుకున్న గృహనిర్మాణ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. సీఎం జగన్ సందేశాన్ని సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షించారు. కార్యక్రమానికి అంతకుముందు కాలనీలో లబ్ధిదారులు కొత్తగా నిర్మించుకొన్న ఇళ్లల్లోకి గృహ ప్రవేశాలు చేయించారు. అనంతరం కాలనీలో మొక్కలు నాటారు. కాలనీలో ఇంటింటికి ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిని కలెక్టర్ ప్రాంభించారు. కార్యక్రమంలో చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, గృహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ బి అర్జునరావు, డ్వామా పీడీ వై శంకర్‌నాయక్, ఈఈ దాశరథి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బెనహర్, పీఆర్ ఎస్ఈ హరేరామకృష్ణ, గృహనిర్మాణ శాఖ డీఈ గోవిందరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, మాజీ సర్పంచ్ లేళ్ల శ్రీధర్, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, ఆసాది అంకాలరెడ్డి, సర్పంచ్ కందేటి రమణ, ఉప సర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు, బుర్ల సాంబశివరావు, ఎంపీడీవో రూతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పైసా ఖర్చు లేకుండా ప్రతి ఇంటికీ వైద్యం

డీఎంహెచ్ఓ విజయమ్మ



చినగంజాం: పైసా ఖర్చు లేకుండా ప్రతి ఇంటికీ సంపూర్ణ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం అని డీఎంహెచ్ఓ ఎస్ విజయమ్మ అన్నారు. గురువారం మండలంలోని చినగంజాం సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డీఎంహెచ్ఓ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ వైద్యాన్ని ప్రతి ఇంటికి ఉచితంగా పూర్తిస్థాయిలో అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పథకాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని కోరారు. 410 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి వారిలో ఆరుగురికి మెరుగైన వైద్యం నిమిత్తం ఆరోగ్యశ్రీ హాస్పిటళ్లకు సిఫార్సు చేశారు. రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఈసీజీ, నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. డీఏవ డీ నరసింహారావు కంటి పరీక్షలు నిర్వహించి 32 మందికి వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే స్వరూపరాణి, ఈఓపీఆర్డీ ఎన్ వేణుగోపాలకృష్ణమూర్తి, డీటీ కే సుబ్బారావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్ విజయభాస్కర్, పీ సాయిశ్రీ చరణ్, స్త్రీల ప్రత్యేక వైద్యులు డాక్టర్ కే షణ్ముఖశ్రీ, ఎస్ రాధాకృష్ణ, సీహెచ్ఓ పీ ఝాన్సీరాణి, పీహెచ్ఎన్ ఎస్ బేబి, ఫార్మసిస్ట్ పీ సుశీల, మురళి, ఆశలు, ఆరోగ్యమిత్రలు, పంచాయతీ కార్యదర్శి ఏ మస్తాన్‌రావు, ఎంఈఓ బీ అజయ్‌బాబు, పాదిలి రాఘవ, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స.హ.చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్



మాట్లాడుతున్న సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్

బాపట్ల: సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలు అధికార యంత్రాంగం జవాబుదారీతనాన్ని రాబట్టాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పి శామ్యూల్ జోనాథన్ పిలుపునిచ్చారు. గురువారం స.హ.చట్ట ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యాన గురువారం వ్యవసాయ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు కళాశాల ఇన్‌చార్జి ఏడీ కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కమిషనర్ మాట్లాడుతూ స.హ.చట్టం ద్వారా పాలనలో పారదర్శకత సిద్ధిస్తుందని అన్నారు. స.హ.చట్టం సామాన్యుడిని సాధికారిగా చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించే అధికారం కూడా ప్రజలకు ఉందని వివరించారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు మాట్లాడుతూ స.హ.చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని అన్నారు. ఈ చట్టం అటకెక్కకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనే ఉందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆచార్య లాల్ అహ్మద్, కోటేశ్వరరావు, బాలాజీరెడ్డి, డేవిడ్ రాజు, రాజారావు, చిత్రకారుడు జీవీ ప్రసన్నాంజనేయులు, అర్జున్, గురజాల శ్రీనివాసరావు, శేఖర్, దేవవరం విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ద్విచక్రవాహనదారుడు, కారు డ్రైవర్ దుర్మరణం





మృతి చెందిన అబ్దుల్ బాషా, సమీర్‌శర్మ

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన మార్టూరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ కమలాకర్ వివరాల మేరకు.. చిలకలూరిపేట నుంచి మార్టూరు వచ్చే సర్వీసు రోడ్డులో చిలకలూరిపేట మండలం పోతవరం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్‌బాషా (50) తన కారులో చిలకలూరిపేట వైపు వెళ్తున్నాడు. స్థానిక హరిప్రియ గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఆసోం రాష్ట్రానికి చెందిన సమీర్‌శర్మ (25) ద్విచక్ర వాహనంపై అదే మార్గంలో మార్టూరు వైపు వస్తున్నాడు. హెచ్‌పీ పెట్రోల్ బంకు ఎదురు ఆటోను తప్పించే క్రమంలో బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. సమీర్ శర్మ బైకుతో సహా గాలిలో ఎగిరి ఎదురుగా వస్తున్న కారుపై పడ్డాడు. ప్రమాద తీవ్రతకు కారు అద్దం పగిలి అబ్దుల్ బాషాకు తలలో తీవ్ర గాయమైంది. ఎగిరి రోడ్డుపై పడిన సమీర్ శర్మకు రెండు చేతులు, రెండు కాళ్లు విరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు బల్లికురవ 108 సిబ్బంది సాయంతో క్షతగాత్రులు ఇరువురిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అబ్దుల్ బాషాను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు అబ్దుల్ బాషాకు భార్య ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. వైద్యుల సూచనపై సమీర్ శర్మను 108 సిబ్బంది గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి గుంటూరు సమీపంలో అతను కూడా మృతి చెందాడు. సమీర్ శర్మ మృతదేహాన్ని 108 సిబ్బంది గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై కమలాకర్ మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని అబ్దుల్‌బాషా మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోనే ఉంచారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వేమూరులో ప్రజాదర్బార్

బాపట్ల: వేమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేయడం కోసం ప్రజల వద్దకే జిల్లా యంత్రాంగమంతా వస్తుందన్నారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు క్షేత్రస్థాయిలో ప్రజాదర్బార్ జరుగుతుందన్నారు. ఈ ప్రజాదర్బార్‌లో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

పాతగుంటూరు:విజయదశమి పురస్కరించుకుని ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లాలోని ఐదు డిపోల నుంచి సాధారణ బస్సులతోపాటు 94 ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.రవికాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18న గుంటూరు నుంచి హైదరాబాద్‌కు 4 బస్సులు, 19న ఎనిమిది, చెన్నై, బెంగళూరు, తిరుపతికి 3 సర్వీసులు, 20న హైదరాబాద్‌కు 24 బస్సులు, చెన్నై, బెంగుళూరు, తిరుపతికి 6 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యం రాజ్య 'మేలు'

ఆరోగ్యభాగ్యం



ఈ చిత్రంలో ఉన్న పెద్దాయన పేరు షేక్ బాషా. ఊరు యడ్లపాడు మండలం బోయపాలెం. రెండేళ్లుగా మూలవ్యాధితో బాధపడుతున్నాడు. స్పెషలిస్టు డాక్టర్ల వద్దకు వెళ్లేందుకు ఆర్థిక స్తోమత లేక సతమతమయ్యాడు. గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో స్పెషలిస్టు డాక్టర్ల వద్ద చూపించుకున్నాడు. పరీక్షల అనంతరం ఫిస్టులా ఉన్నట్టు స్పెషలిస్టు వైద్యులు నిర్ధారించారు. ఉచితంగా మందులు ఇచ్చారు. గుంటూరు జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు. అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేస్తామని భరోసా ఇచ్చారు. దీంతో బాషా ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

- ప్రజారోగ్యానికి రక్ష
- జయప్రదంగా వైద్యశిబిరాలు
- ప్రజల నుంచి విశేష స్పందన



మాచర్ల టౌన్‌లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపులో మహిళకు ఉచితంగా మందులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



బోయపాలెంలో వృద్ధురాలికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తమాలజిస్టు ప్రతాప్‌కుమార్

సాక్షి, నరసరావుపేట: అందరికీ ఆరోగ్యం.. అదే జగనన్న లక్ష్యం నినాదంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోంది. గత నెల 15వ తేదీ నుంచి ఇంటింటికీ వలంటీర్లు వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలపై సర్వే చేశారు. దీర్ఘకాలిక, ఇతర వైద్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల వద్దకు రావాలని ఆహ్వానించారు. వైద్యశిబిరాల్లో స్పెషలిస్టు, పీహెచ్‌సీ డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లాలో మొత్తం 396 వైద్యశిబిరాలు నిర్వహించేలా వైద్య ఆరోగ్య శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే 173 శిబిరాలు విజయవంతంగా పూర్తయ్యాయి. వైద్యశిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. తమ వద్దకే స్పెషలిస్టు డాక్టర్లు వచ్చి అత్యాధునిక పరీక్షలు ఉచితంగా చేసి పైసా ఖర్చు లేకుండా వైద్యసేవలు, మందులు అందిస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గ్రామీణ ప్రాంతాల్లో 161 క్యాంపులు

పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు 173 ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించగా అందులో గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధికంగా 161 క్యాంపులు ఏర్పాటు చేయడం విశేషం. 63,741 మందికి ఓపీ సేవలు అందించగా అత్యధికంగా మహిళలు 34,942 మంది, పురుషులు 28,799 మంది ఉన్నారు. మెరుగైన వైద్య సేవల కోసం 1,744 మందిని పెద్దాస్పత్రులకు రిఫర్ చేయగా 485 మందిని ఏరియా ఆస్పత్రులకు, 178 మందికి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు, ఒకరిని జీజీహెచ్‌కు, 857 మందిని ఆరోగ్యశ్రీ నెట్వర్క్ ఆస్పత్రులకు పంపారు. వీరికి అవసరమైన తదుపరి వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలనూ ఉచితంగా చేయనున్నారు. వైద్యశిబిరాల నిర్వహణను జిల్లా ప్రజాప్రతినిధులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో ఆరోగ్యసురక్ష ఇలా..

వైద్యశిబిరాల లక్ష్యం	: 396
ఇప్పటివరకు నిర్వహించినవి	: 173
స్పెషలిస్టు డాక్టర్ల సంఖ్య	: 146
పీహెచ్‌సీ డాక్టర్ల సంఖ్య	: 134
ఇప్పటివరకు ఓపీ నమోదు	: 63,741
ఉచితంగా మందులు పొందిన వారు	: 60,356
మెరుగైన చికిత్స నిమిత్తం రిఫర్ చేసిన వారు	: 1,744

ఇది పేదల ప్రభుత్వం



కొన్నేళ్లుగా మోకాలి నొప్పులతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాను. మా గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరిగింది. నేను వెళ్లా. వైద్యులు పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇచ్చారు. ఇంతకన్నా పేద ప్రజలకు అండగా నిలిచేదెవరు. ఇది కదా పేదల ప్రభుత్వం.

– తురిమెళ్ల చౌడమ్మ, ముప్పాళ్ల గ్రామం, ఈపూరు మండలం

మా పల్లెకు ఇంత పెద్ద డాక్టర్లు వస్తారనుకోలేదు...



కొంతకాలంగా రెండు కాళ్లు చచ్చు తీపి (బాధ) వల్ల ఎక్కువ సేపు నిలబడలేకపోతున్నా. నడవలేకపోతున్నా. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వలంటీర్ చెప్పగా వెళ్లాను. వైద్యులు పరీక్షలు చేసి మందులు అందించారు. కొంత ఉపశమనం కలిగింది. ఈ జబ్బు త్వరలోనే నయం అవుతుందని వైద్యులు చెప్పారు. మా పల్లెకు ఇంత పెద్ద డాక్టర్లు వస్తారనులేదు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– బుసిరెడ్డి చిన్నపరెడ్డి, పోలేపల్లి గ్రామం, దుర్గి మండలం

మారుమూల గ్రామాలకూ స్పెషలిస్టు డాక్టర్లు



జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు విజయవంతంగా జరుగుతున్నాయి. ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. జిల్లాలో 146 మంది స్పెషలిస్టు డాక్టర్లు, 134 మంది పీహెచ్‌సీ డాక్టర్లు సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే 63,741 మందికి ఓపీ సేవలు నిర్వహించాం. 396 హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నాం. మారుమూల గ్రామాలకూ స్పెషలిస్టు డాక్టర్లు వెళ్లి వైద్యం చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

– డాక్టర్ బి.రవి, పల్నాడు డీఎంహెచ్ఓ

'ప్రకృతి' సాగు వైపు రైతులను ప్రోత్సహించాలి

డీపీఎం వాణీశ్రీ



బ్రహ్మాస్త్రం తయారు చేసి చూపిస్తున్న అధికారులు

వేటపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో రైతులను ప్రకృతి వ్యవసాయ సాగు వైపు ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ డీపీఎం వీరగాని వాణీశ్రీ సూచించారు. మండలంలోని దేశాయిపేట రైతు భరోసా కేంద్రంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సిబ్బంది సామర్థ్యం పెంపుదలపై గురువారం శిక్షణ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో కషాయం, బ్రహ్మాస్త్రం, వేప గింజల కషాయం, దశపర్ణి కషాయిల తయారీ విధానాన్ని స్వయంగా చేసి చూపించారు. కార్యక్రమంలో ఏఓ ఐ.కాశీవిశ్వనాథ్, డీఎపీఎం మోషన్, డీపీఎంయులు చీరాల, పర్చూరు, వేటపాలెం, యద్దనపూడి మండలాల ఏఈపీ సీఎస్‌ఏపీలు పాల్గొన్నారు.

ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ కోచ్‌గా అనంతకుమార్‌రెడ్డి



చినగంజాం: ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కోచ్‌గా కుక్కల అనంతకుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు గురువారం ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏ గౌతమ్ కిరణ్ నుంచి ఉత్తర్వులు అందాయి. చినగంజాం మండలం మున్నంవారిపాలేనికి చెందిన అనంతకుమార్ రెడ్డి, ఎన్ఎస్ఐ అథ్లెటిక్స్ కోచ్‌గా శిక్షణ పొందగా ఇప్పుడు ఆయనను రాష్ట్ర అథ్లటిక్స్ టీంకు కోచ్‌గా నియమించారు. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు తెలంగాణలోని హనుమకొండలో నిర్వహించనున్న 34వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోచ్‌గా వ్యవహరించనున్నారు.

భక్తుల భద్రతకు పెద్ద పీట



- దసరా ఉత్సవాలకు 3 వేల మందితో బందోబస్తు
- చోరీల నియంత్రణకు ప్రత్యేక బృందాలు
- అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా
- మోడల్ గెస్ట్ హౌస్ కంట్రోల్ రూంలో 24 గంటలూ పనిచేసేలా సిబ్బంది నియామకం
- ఎన్టీఆర్ జిల్లా సీపీ టి.కె.రాణా

సాక్షి ప్రతినిధి, విజయవాడ: దసరా ఉత్సవాలకు పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. ఈ సారి ఉత్సవాలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. భక్తులకు సౌకర్యాల కల్పన, భద్రతకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు మూడు వేల మంది పోలీసు అధికారులు, సిబ్బంది విధుల్లో ఉంటారని వివరించారు. సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా వీలైనంత తక్కువ సమయంలో దుర్గమ్మ దర్శనమయ్యేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లపై 'సాక్షి' ప్రతినిధితో సీపీ టి.కె.రాణా ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాల నుంచి అదనపు సిబ్బంది

దేవీశరన్నవరాత్రులకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి లక్షల మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. ఉత్సవాల సాధారణ రోజుల్లో రోజుకు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉంది. 20వ తేదీ మూలా నక్షత్రం రోజు 1.5 లక్షల నుంచి రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనావేస్తున్నాం. కొండపైన, దిగువన ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, బందోబస్తు విధులకు కమిషనరేట్ పరిధిలోని సిబ్బందితో పాటు జిల్లాల నుంచి అదనంగా సిబ్బందిని రప్పిస్తున్నాం. మూడు షిఫ్టుల్లో సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తారు. ఎక్కువ మందిని ఆలయం, దుర్గాఘాట్, బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో మోహరిస్తాం. గతంలో వీఐపీలను మోడల్ గెస్ట్‌హౌస్ నుంచి తరలించేవారు. ఈ సారి భవానీ ఘాట్ నుంచి తరలిస్తాం. అంతరాలయంలో భక్తులకు త్వరిత గతిన దర్శనమయ్యేలా మహిళా పోలీసులకు శిక్షణ ఇప్పించాం.

రద్దీ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు

భక్తుల రద్దీని తట్టుకొనేందుకు వీలుగా క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నాం. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి, భవానీపురం వైపు నుంచి వచ్చే భక్తులకు కుమ్మరిపాలెం సెంటర్ హెడ్ వాటర్ వర్క్స్ నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశాం. గతంలో వినాయకుడి గుడి నుంచి మోడల్ గెస్ట్ ఎదురుగా కొండ పక్క నుంచి టోల్‌గేటు మీదుగా ఇంద్రకీలాద్రికి భక్తులు చేరుకొనేలా క్యూలైన్లు ఉండేవి. ఇటీవల కొండ చరియలు విరిగిపడిన నేపథ్యంలో క్యూలైన్‌లను మోడల్ గెస్ట్ హౌస్ వద్ద ఎడమ వైపు మళ్లించి ఫ్లై ఓవర్ కింద నుంచి ఫుట్ బ్రిడ్జిపైగా ఘాట్ మీదుగా, కుమ్మరిపాలెం క్యూలైన్లను టోల్‌గేట్ నుంచి కుడి వైపు మళ్లించి ఫుట్ బ్రిడ్జి నుంచి కొండపైకి చేరుకొనేలా ఏర్పాటు చేశాం. ఇందు కోసం ఈ ఏడాది ప్రత్యేకంగా రెండు ఫుట్ బ్రిడ్జిలను సిద్ధం చేశాం.

దివ్యాంగుల కోసం..

మోడల్ గెస్ట్‌హౌస్ వద్ద దివ్యాంగుల కోసం ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతున్నాం. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో తొక్కిసలాటకు తావులేకుండా వీఎంసీ కార్యాలయం ఖాళీ స్థలంలో ప్రత్యేక కంపార్ట్ మెంట్లు ఏర్పాటు చేసి, ఇక్కడ 15 వేల మంది వేచి ఉండేలా చర్యలు తీసుకున్నాం. భక్తులకు లడ్డూ ప్రసాదాలు అందుబాటులో ఉండేలా 12 ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. స్నాన ఘాట్ల వద్ద భక్తుల రక్షణ కోసం బార్‌కేడ్లు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని ఘాట్ల వద్ద ప్రత్యేకంగా సిమ్మర్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నాం.

నిరంతర నిఘా

మోడల్ గెస్ట్‌హౌస్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. అక్కడి నుంచి రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, దేవదాయ తదితర శాఖల అధికారులు నిరంతరం భక్తులను పర్యవేక్షిస్తారు. ఇక్కడ 24 గంటలూ పనిచేసేలా సిబ్బందికి విధులు కేటాయిస్తాం. నిఘా కోసం ముఖ్యమైన ప్రాంతాల్లో 250లకు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. దొంగలను కనిపెట్టేలా ప్రత్యేకంగా క్రైమ్ స్పాటర్లను రంగంలోకి దించుతున్నాం. విజయవాడలో ట్రాఫిక్ నియంత్రణ కోసం వివిధ మార్గాల్లో వాహనాలను మళ్లిస్తాం.

హైదరాబాద్ జట్టు ఘన విజయం..

మంగళగిరి: ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో గురువారం ప్రారంభమైన తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు పరుగుల వర్షం కురిపించింది. బీసీసీఐ ఆధ్వర్యంలో మినూ మన్కడ్ ట్రోఫీ అండర్-19 తొలి మ్యాచ్‌లో హైదరాబాద్, ఉత్తరాఖండ్ జట్లు తలపడ్డాయి. ఉత్తరాఖండ్ జట్టుపై హైదరాబాద్ జట్టు 77 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 345 పరుగులు భారీ స్కోర్ సాధించింది. జట్టు బ్యాట్స్‌మన్ ఏ అవినాష్ 70 బంతులలో 14 ఫోర్లు, ఎనిమిది సిక్స్‌లతో 128 పరుగులు సాధించాడు. ఆరాన్ జార్జి 77 బంతుల్లో ఐదు ఫోర్లతో 60 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మన్ ఎం.ఎస్. కార్తీకేయ 34 బంతులలో ఎనిమిది ఫోర్లు, రెండు సిక్స్‌లతో 55 పరుగులతో నాటౌట్‌గా నిలవడంతో భారీ స్కోర్ సాధించారు. ఉత్తరాఖండ్ బౌలర్ ఆషార్ ఖాన్ 10 ఓవర్లలో 47 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు.అనంతరం 346 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టులో సన్‌స్కార్ రావత్ 74 బంతులలో 11 ఫోర్లు, ఒక సిక్స్‌తో 86 పరుగులు సాధించగా 47.4 ఓవర్లలో 268 పరుగులకు ఆలౌటైంది. దీంతో హైదరాబాద్ జట్టు 77 పరుగులతో ఘన విజయం సాధించింది.

ఐఈఆర్పీ పోస్టుల మెరిట్ లిస్ట్ విడుదల

బాపట్ల అర్బన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో ఖాళీగా ఉన్న ఐఈఆర్పీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తాత్కాలిక మెరిట్ లిస్ట్, ఎలిజిబులిటీ స్టేటస్‌ను హెచ్‌టీటీపీఎస్://ఏపీఐఈ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాకి సంబంధించి అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉన్నా సంబంధిత ధ్రువ పత్రాలతో ఈనెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేటపాలెం విద్యార్థులు



వేటపాలెం: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వేటపాలెం విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకి ఎంపికైనట్లు హెచ్‌ఎం దుర్గా ప్రసాద్ గురువారం తెలిపారు. ఈనెల 11న ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్‌లో అండర్-17 విభాగంలో కే సింధు, డీ దివ్య, అండర్ -14 విభాగంలో పీ పూజిత, కే లత పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులను పీఈటీ ఏ కోటేశ్వరమ్మ, జే శ్రావణి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్‌కు వలపర్ల విద్యార్థులు



మార్టూరు: వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ రవి దేవరాజ్ గురువారం తెలిపారు. బేస్‌బాల్ అండర్- 17 విభాగంలో షేక్ ఆఫ్రాజ్, అండర్- 14 విభాగంలో టీ మోక్షజ్ఞ సాయి బాలికల విభాగంలో ఎం.శ్రీవల్లి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాగా త్రోబాల్ పోటీలో అండర్- 14 విభాగంలో జే అమృత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విజేతలను హెచ్‌ఎం ఎం.నిర్మల అభినందించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

రూ.4 లక్షల విలువైన 6 వాహనాలు స్వాధీనం



పర్చూరు(కారంచేడు): అదును దొరికినప్పుడల్లా ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న వ్యక్తిని పర్చూరు పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం వివరాలు వెల్లడించారు. ఈనెల 5వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా పెట్టిన ద్విచక్రవాహనం కనిపించడం లేదని ఒక ఫిర్యాదు అందింది. దీని ఆధారంగా మార్టూరు సీఐ ఫిరోజ్ పర్యవేక్షణలో పర్చూరు ఎస్ఐ చెంచు ప్రసాద్ సారథ్యంలో బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. పట్టణంలో సీసీ కెమెరాల ఆధారంగా, సాక్షులు ఇచ్చిన సమాచారంతో నిందితుడిని గుర్తించారు. గురువారం ఉదయం వై జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూత్‌డెక్‌మెన్ కాలనీకి చెందిన నిందితుడు పోతురాజు వీరబాబు పోలీసులను గమనించి వెనుతిరిగి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి పట్టుకొని విచారించారు. సుమారు రూ.4 లక్షల విలువైన ఆరు ద్విచక్రవాహనాలు దొంగిలించినట్లు అంగీకరించాడు. వాహనాలను స్వాధీనం చేసుకొని వీరబాబును కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. చోరీకి గురైన వాహనాల రికవరీలో కృషి చేసిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

5కే రన్ విజేత మణికంఠ

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాజు అండ్ రవి 5కే రన్ విజేతగా డి.మణికంఠ నిలువగా వరసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎ.మనోజ్, వై.సతీష్ నిలిచారు. గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో 5కే రన్‌ను రాజకీయ విశ్లేషకులు చందు సాంబశివరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ విదేశాల్లో స్థిరపడినప్పటికీ స్థానికంగా ఈపోటీలు నిర్వహించిన మంతెన రాజు, నరాలశెట్టి రవిలను అభినందించారు.

తొలి ఇన్నింగ్స్‌లో గుంటూరు ఆధిక్యం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర సెంట్రల్‌జోన్ అంతర్ జిల్లాల అండర్-23 టెస్ట్ మ్యాచ్‌లో గుంటూరు జిల్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 19 పరుగుల ఆధిక్యం సాధించింది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న గుంటూరు, కృష్ణా జిల్లాల మ్యాచ్‌లో బుధవారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ రెండు వికెట్లు నష్టానికి 101 పరుగులతో గురువారం రెండో రోజు ఆట ప్రారంభించిన కృష్ణా జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 77.5 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో 280 పరుగులు సాధించిన గుంటూరు జట్టుకు 19 పరుగుల ఆధిక్యత లభించింది. కృష్ణా జట్టులోని చంటి ఒంటరి పోరాటం చేసి సెంచరీ(101) సాధించగా, ఖాజా 57, దుర్గారావు 44 పరుగులు సాధించారు. గుంటూరు బౌలర్లు లక్ష్మీగోపి, మనోహర్‌లకు చెరో 3 వికెట్లు, ఆదిత్యరెడ్డి 2 వికెట్లు సాధించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గుంటూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు కోల్పోయి వంద పరుగులు చేసింది. జట్టులోని సూర్యవంశీ 48 పరుగులు చేయగా, మహిమకుమార్ 4 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. శుక్రవారం చివరిరోజు ఆట కొనసాగుతుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

అటవీ భూములు, వన్య ప్రాణుల సంరక్షణపై దృష్టి

పల్నాడు జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు



అటవీ రేంజ్ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు

పిడుగురాళ్ల: అటవీ భూములు, వన్య ప్రాణుల సంరక్షణపై అటవీ శాఖాధికారులు దృష్టి పెట్టాలని పల్నాడు జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.రామచంద్రరావు పేర్కొన్నారు. స్థానిక అటవీ రేంజ్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, వన్య ప్రాణి రక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. క్యాలెండర్ ప్రకారం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని క్షేత్రస్థాయిలో అధికారులను ఆదేశించారు. వన్య ప్రాణుల వేటను అరికట్టాలని, అటవీ ఆక్రమణదారులతో కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. వర్షాభావ పరిస్థితిలు నెలకొని ఉండటం వలన వన్య ప్రాణుల కోసం నీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే సిబ్బంది కోసం గ్రీవెన్స్ నిర్వహించి ప్రతి ఒక్క సిబ్బంది సమస్యలను తెలుసుకొని వారి సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. సిబ్బంది సంక్షేమం కోసం, సౌకర్యార్థంగా విధులు నిర్వహించేందుకు పలు రకాల పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

కోనంకి అటవీ ప్రాంతాన్ని..

మండలంలోని కోనంకి బీట్‌లో ఈ ఆర్థిక సంవత్సరం చేపట్టిన అటవీ అభివృద్ధి పనులను బీఎఫ్ఓ ఎస్.రామచంద్రరావు తనిఖీ చేశారు. అదే విధంగా మాచాయపాలెం బీఎస్ఎస్ ద్వారా నిర్మాణం చేపట్టిన నీటి కుంటలను, ప్లాంటేషన్ అయిన ప్రాంతాలను పరిశీలించారు. ఆయన వెంట పిడుగురాళ్ల డెప్యూటీ రెంజ్ ఆఫీసర్ బీవీఎల్ నాయుడు, బీట్ అధికార్లు షేక్ జానీబాషా, నరసింహారెడ్డి ఉన్నారు.

అడ్రస్ కోసం వెతుకుతూ అనంత లోకాలకు..

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కంటైనర్
- లారీ డ్రైవర్ మృతి



మృతుడు కోమటి కృష్ణారావు

యడ్లపాడు: జాతీయ రహదారిపై నిలుపుదల చేసిన లారీని అదేమార్గంలో వస్తున్న మరో వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని తిమ్మాపురం పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రాజమండ్రి నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న పొగాకు లోడు లారీ డ్రైవర్, క్లీనర్‌లు తిమ్మాపురం వద్ద ఉన్న క్రీస్తుసంఘం చర్చి వద్ద నివాసితుల్ని అడ్రస్ అడిగేందుకు హైవే పక్కగా లారీని నిలుపుదల చేశారు. స్థానికులు రాజేంద్ర, అతడి ఆరేళ్ల కుమారుడు జాన్‌వెస్లీ ఆగిన లారీ ఎదురుగా లైట్లకింద అడ్రస్ చీటిని చదివి చెబుతున్న క్రమంలో అదే మార్గంలో వచ్చిన కంటైనర్ ఆగి ఉన్న లారీని వెనుకగా ఢీకొట్టింది. దీంతో ముందున్న లారీ కదిలి దాని ఎదురుగా నిలబడి ఉన్న వారిపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఐపంగిడి గ్రామానికి చెందిన పొగాకులోడు లారీ డ్రైవర్ కోమటి కృష్ణారావు(67)కు తీవ్రంగా, దేగల జాన్‌వెస్లీకి, క్లీనర్ నాగరాజుకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనం ద్వారా చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ డ్రైవర్ కృష్ణారావు మృతి చెందాడు. యడ్లపాడు ఎస్ఐ సురేష్ వాహనాలను పక్కకు తీయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేసి, కేసు నమోదు చేశారు.